నట్టింట్లో మూడో కన్ను

- లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టంతో ఇళ్లు భద్రం
- ఉచిత సేవలు అందిస్తున్న పోలీస్ శాఖ

కాకినాడ క్రైం: వరుస పండగలున్నాయి, పిల్లలకు సెలవులున్నాయి. సరదా సందర్శకో, దేవుడి దర్శనాలకో, బంధువుల ఇళ్లకో అలా వెళ్లి కొద్ది రోజులు గడిపి వద్దాం అనుకుంటున్నారా. మరి ఇంటి భద్రత సంగతేంటి? ఓహ్.. తాళాలు వేసి వెళుతున్నాం కదా అనుకుంటున్నారా! ఆ తాళాలు బద్దలుకొట్టి నిలువుదోపిడీ చేసిన ఘనుల సంగతి తెలియనిదా.. ఇంటిని సీసీ కెమేరాల దిగ్బంధనంలో ఉంచానను ధీమాగా ఉన్నారా... ఎక్కడో ఉంటూ సెల్‌ఫోన్ స్క్రీన్‌లో అణువణువునూ పట్టి చూస్తా కదా అనే అతి విశ్వాసంతో ఉన్నారా. అలా మీరు ఎక్కడో ఉన్నప్పుడు కెమేరా ముందే ముసుగేసుకున్న దొంగలు ఇంటిని ఊడ్చేస్తుంటే చేసేదేమైనా ఉందా? అందుకే పోలీస్ శాఖ ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను ప్రజల కోసం అందుబాటులోకి తెచ్చింది. ప్రజలు వినియోగించుకోవాలంటూ విస్తృత ప్రచారం కల్పిస్తోంది.

ఎల్‌హెచ్‌ఎంఎస్ అంటే..

లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టంనే ఎల్‌హెచ్‌ఎంఎస్ అంటారు. తాళాలు వేసి ఉన్న ఇళ్లను దొంగల బారి నుంచి కాపాడేందుకు పోలీస్ శాఖ అందిస్తున్న ఉచిత సేవ. సాంకేతికతను జోడించి, ఇంటి భద్రతను కట్టుదిట్టంగా నిర్వహించే ఓ అధునాతన వ్యవస్థ. ఇంటర్నెట్ సాయంతో సెన్సార్ల అనుసంధానం, హైరిజల్యూషన్ కెమేరాలు ఏర్పాటు చేసి, ఓ ప్రత్యేక వ్యవస్థ ఇంటి భద్రతను పర్యవేక్షిస్తుంటుంది.


కంట్రోల్ రూమ్ నుంచి ఓ ఇంటి భద్రతను పర్యవేక్షిస్తున్న సిబ్బంది

కదిలితే కంట్రోల్ రూం అలర్ట్

ఇళ్లల్లో ఏర్పాటు చేసిన కెమేరాలు కాకినాడలోని జిల్లా పోలీస్ కార్యాలయంలో ఉన్న కంట్రోల్ రూంకి అనుసంధానం అయి ఉంటాయి. కెమేరాలలో ఏ మాత్రం కదలిక నమోదైనా తక్షణమే కంట్రోల్ రూంలో సైరన్ మోగుతుంది. అలా మోగిన వెంటనే సిబ్బంది కెమేరాలను పరిశీలిస్తారు. అనుమానాస్పదంగా ఏమైనా గుర్తిస్తే, సంబంధిత స్టేషన్‌కు సమాచారం ఇస్తారు. నిమిషాల వ్యవధిలో పోలీసులు ఇంటికి చేరుకుంటారు. ఈ పర్యవేక్షణ రోజులో 24 గంటల పాటు కొనసాగుతుంది.

ఈ సేవలు పొందడం ఎలా?

లాక్డ్ హౌస్ మానిటరింగ్ సిస్టం సేవలు పొందేందుకు ఎల్‌హెచ్‌ఎంఎస్ ఏపీ పోలీస్ యాప్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలి. అందులో వివరాల నమోదు చేసి రిజిస్టర్ చేసుకోవాలి. ఎప్పుడు కావాలో స్పష్టతనిచ్చే క్రమంలో తేదీలు, ఎప్పటి నుంచి ఎప్పటి వరకో అన్న విషయాన్ని నిర్ధారించాలి. ఈ సమాచారం పోలీస్ కార్యాలయానికి చేరితే వారు స్థానిక స్టేషన్‌కు సమాచారం ఇస్తారు. వారు యాప్‌లో నమోదు కాబడ్డ ఇళ్లకు వెళ్లి కెమేరాలు ఇన్‌స్టాల్ చేస్తారు. అలాగే, ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను ప్రజలకు మరింత చేరువ చేసే క్రమంలో పోలీసులు ఫోన్ కాల్, వాట్సాప్ సేవలు అందుబాటులోకి తెచ్చారు. వాట్సాప్ ద్వారా నమోదు చేసుకునేందుకు 9494 933 233 నంబరుకు సమాచారం ఇవ్వాలి. అలాగే 94907 63489 నంబరుకు కాల్ చేసినా సేవలు పొందే వెసులుబాటు ఉంది.

విస్తృత ప్రచారం

ఇటీవల కాలంలో చోటు చేసుకుంటున్న వరుస దొంగతనాల నేపథ్యంలో పోలీస్ శాఖ అప్రమత్తమైంది. తాళాలు బద్దలు కొట్టి ఇళ్లు గుల్ల చేస్తున్న దొంగల భరతం పట్టాలని నిర్ణయించింది. అదే సమయంలో ప్రజల ఆస్తుల్ని సంరక్షించేందుకు కట్టుబడి ఉంది. ఈ నేపథ్యంలో ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలపై విస్తృత ప్రచారం కల్పిస్తోంది.

40 పరికరాలు ఉన్నాయి



పోలీస్ శాఖ అందుబాటులో 40 పరికరాలు ఉన్నాయి. వాటిని స్టేషన్లకు కేటాయించాం. ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలు కోరుకునే వారు నిర్దేశించిన రీతిలో నమోదైన తర్వాత గంటల వ్యవధిలోనే కెమేరా సహా పరికరాలను ఇళ్లల్లో అమర్చుతారు. లబ్ధిదారులు ఈ సేవలు వినియోగించుకోవడానికి ఒక్క రూపాయి కూడా వెచ్చించాల్సిన అవసరం లేదు. పూర్తి ఉచితం. పండగలు, సెలవుల నేపథ్యంలో ఇళ్లకు తాళాలు వేసి వెళ్లే అవకాశం ఉంది. అటువంటి వారు ఎల్‌హెచ్‌ఎంఎస్ సేవలను తప్పకుండా సద్వినియోగం చేసుకోవాలి.

– విక్రాంత్ పాటిల్, ఎస్పీ, కాకినాడ జిల్లా

క్లుప్తంగా

స్టడీ మెటీరియల్ అందజేత


విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న తలాటం హరీష్

బోట్‌క్లబ్: పోటీ పరీక్షలకు **హాజరయ్యే పేద** విద్యార్థులకు అవసరమైన స్టడీ మెటీరియల్‌ను సానా సతీష్‌బాబు ఫౌండేషన్ సౌజన్యంతో గురువారం స్థానిక జిల్లా గ్రంథాలయంలో పలువురికి అందించారు. ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ మాట్లాడుతూ పోటీ పరీక్షలకు హాజరయ్యేందుకు సుదూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థులు స్టడీ మెటీరియల్ లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారని గ్రంథాలయ సంస్థ సెక్రటరీ ప్రసాద్ తన దృష్టికి తీసుకు వచ్చారన్నారు. వెంటనే స్పందించి విద్యార్థులకు అవసరమైన జనరల్ నాలెడ్జి, అర్థమెటిక్, ఇంగ్లిషు పుస్తకాలు అందించనట్లు చెప్పారు. ట్రస్ట్ సభ్యులు గంగాధర్ మాట్లాడుతూ స్టడీ మెటీరియల్ సద్వినియోగం చేసుకుని ఉద్యోగాల్లో స్థిరపడి తిరిగి లైబ్రరీకి సాయం చేయాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు మంగా వెంకట శివరామకృష్ణ, మణికంఠ, చార్లీ, లైబ్రరీ సహాయ కార్యదర్శి కిశోర్ పాల్గొన్నారు.

వినికిడి పరికరాల వితరణ


వినికిడి పరీక్షలు చేయించుకున్న బాలలతో అధికారులు, సిబ్బంది

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లోని ఈఎన్‌టి సెమినార్ హాల్లో గురువారం వినికిడి సమస్యలున్న వారికి పరీక్షలు నిర్వహించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో డీఎంహెచ్‌వో డాక్టర్ నరసింహ నాయక్ పర్యవేక్షణలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. వినికిడి సమస్యలు ఉన్నవారికి పరీక్షలు నిర్వహించి శ్రవణ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత వినికిడి పరికరాలు అందిస్తామని డీఎంహెచ్‌వో అన్నారు. జిల్లాలో ఎవరైనా వినికిడి సమస్యలతో బాధపడితే జీజీహెచ్‌లోని డైస్ విభాగాన్ని, డీఎంహెచ్‌వో కార్యాలయంలో ఎన్‌సీడీ విభాగాన్ని సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ, ఆర్‌బీఎస్‌కే పీవో డాక్టర్ ఆర్.ప్రభాకర్, ఎన్‌సీడీ ఎఫ్‌ఎల్‌పీ వెంకట శ్రీను, డైస్, శ్రవణ్ ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

యంగ్‌మైండ్స్ సేవలు అభినందనీయం

బాలాజీచెరువు: సామాజిక సేవలో యంగ్‌మైండ్స్ సేవలు అభినందనీయమని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. యంగ్‌మైండ్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వహించిన అందజేసిన ప్యాడ్స్, పుస్తకాలను గురువారం పంపిణీ చేశారు. ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ యంగ్‌మైండ్స్ ద్వారా అటు విద్యా విషయాలపై అవగాహనతో పాటు సామాజిక సేవలో భాగంగా ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం సంతోషకరమని, సంస్థ వ్యవస్థాపకుడు వాకాడ వెంకటరమణ సేవలు అభినందనీయమన్నారు. అలాగే నవోదయ పరీక్ష స్టడీ మెటీరియల్ అందజేసి పేద విద్యార్థులకు మరింత ఉపకారం చేస్తున్నారన్నారు.

సినిమాలు



ఆనంద్ సినిమాస్ 4 స్క్రీన్స్:	దేవర పార్ట్–1, దక్షిణ,సత్య సుందరం
దేవీ మల్టీప్లెక్సు 4 స్క్రీన్స్:	దేవర పార్ట్–1, సత్య సుందరం, కాళీ
లక్ష్మి:	దేవర పార్ట్–1
సత్యగౌరి:	దేవర పార్ట్–1
తిరుమల:	దేవర పార్ట్–1
సీఅండ్‌సీ1:	మత్తువదలరా
సీఅండ్‌సీ2:	శ్వాగ్
శ్రీప్రియ:	రామ్ నగర్ బన్ని
పద్మప్రియ:	దేవర పార్ట్–1
సూర్య (వాకలపూడి):	దేవర పార్ట్–1
సూర్య2:	మిస్టర్ సెలబ్రిటీ

నోటి పరిశుభ్రతతో ఆరోగ్యం


శిబిరంలో దంత పరీక్షలు చేస్తున్న డాక్టర్ అడ్డాల సత్యనారాయణ

కాకినాడ రూరల్: నోటి పరిశుభ్రతతో ఆరోగ్యం కలుగుతుందని, సహజ దంతాలను జీవితాంతం కాపాడుకునేందుకు వీలవుతుందని దంత వైద్యుడు అడ్డాల సత్యనారాయణ పేర్కొన్నారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత దంత వైద్య శిబిరంలో ఆయన వృద్ధులకు దంత పరీక్షలు నిర్వహించి, దంత సంరక్షణ గురించి అవగాహన కల్పించారు. అతి వేడి, అతి శీతల పదార్థాలు తీసుకోవడం వల్ల దంతాలపై ఉన్న ఎనామిల్ దెబ్బతింటుందన్నారు. బలంగా బ్రష్ చేసి దంతాలపై ఎనామిల్ దెబ్బతినే అవకాశం ఉన్నందున మృదువైన టూత్ బ్రష్‌తో దంతాలు శుభ్ర పరుచుకోవలన్నారు. అడబాల రత్నప్రసాద్, నిమ్మకాయల వెంకటేశ్వరరావు, బుద్ధరాజు సత్యనారాయణ రాజు, రాఘవరావు, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

సాయిబాబాకు వెండి దీపారాధన కుందుల సమర్పణ


శ్రీనివాసరావుకు వెండి కుందులను అందజేస్తున్న కూర్మేశ్వరరావు దంపతులు

మచిలీపట్నంటౌన్: నగరంలోని బలరామునిపేటలో ఉన్న కోదండరామాలయంలోని షిర్డీ సాయి బాబాకు కాకినాడకు చెందిన కోకా కూర్మేశ్వరరావు–శైలజ దంపతులు గురువారం రూ.50 వేల విలువైన వెండి దీపారాధన కుందులు బహూకరించారు. వీటిని ఆలయ ధర్మకర్త పిళ్లారిశెట్టి శ్రీనివాసరావుకు అందజేశారు.

జీజీహెచ్‌లో బ్యాక్ పెయిన్ క్లినిక్


జీజీహెచ్‌లో బ్యాక్ పెయిన్ క్లినిక్‌ను ప్రారంభిస్తున్న డాక్టర్ లావణ్యకుమారి

కాకినాడ క్రైం: కాకినాడ జీజీహెచ్‌లో గురువారం బ్యాక్ పెయిన్ స్పెషాలిటీ క్లినిక్ ప్రారంభమైంది. ఆర్థోపెడిక్స్ హెచ్‌వోడీ డాక్టర్ ఎంపీఆర్ విఠల్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి ఈ క్లినిక్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ లావణ్యకుమారి, డాక్టర్ విఠల్ మాట్లాడుతూ, నడుం నొప్పి, మోకాళ్ల నొప్పులు, పుట్టుకతో వచ్చే పాదాల వంకర్ల సమస్యలకు ఈ స్పెషాలిటీ క్లినిక్‌లో చికిత్స అందిస్తామన్నారు. డీఎంఈ డాక్టర్ డీఎస్‌వీఎల్ నరసింహం సూచనల మేరకు స్పెషాలిటీ క్లినిక్ ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఎంసీ వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ విష్ణువర్ధన్, ఆర్థోపెడిక్ వైద్యులు పార్థసారధి, జీఎస్ ముఖర్జీ, వింధ్య, ప్రసన్న, రామకృష్ణ, కేతన్, నిరూప, సుధాకర్‌తో పాటు ఆర్థోపెడిక్ సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా శరన్నవరాత్ర ఉత్సవాలు

- దుర్గమ్మ ఆలయాల్లో భక్తుల కిటకిట
- కుంకుమ పూజలు చేసిన మహిళలు
- ప్రత్యేక అలంకరణల్లో అమ్మవార్ల దర్శనం


విల్లంబులతో సూర్యారావుపేట బాలాత్రిపుర సుందరి అమ్మవారు


రిజర్వులైన్ కామాక్షి ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు


భానుగుడిలో బాలాత్రిపుర సుందరిగా

బోట్‌క్లబ్: శరన్నవరాత్ర వేడుకలు నగరంలో గురువారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు అమ్మవారిని దర్శించుకునేందుకు అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉదయం నుంచి సాయంత్రం వరకూ ఆలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. స్థానిక బాలత్రిపుర సుందరి ఆలయంలో తొలిరోజు అమ్మవారు విల్లంబులలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకుడు చెరుకూరి సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా చక్రధారి భజన మండలి ఆధ్వర్యంలో ఆలపించిన కీర్తనలు భక్తులను అలరించాయి. శరణ్య స్కూల్ ఆఫ్ ఫైన్ ఆర్ట్స్ విద్యార్థులు చేసిన భరతనాట్యం భక్తులను అలరించింది. స్థానిక దేవాలయం వీధిలో ఉన్న బాలత్రిపుర సుందరి సమేత భీమేశ్వర ఆలయంలో అమ్మవారు గాయత్రిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యంగా కలుగకుండా ఈవో రాపర్తి రాజేశ్వరరావు ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. మాధవనగర్‌లో ఉన్న కనకదుర్గ అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు సూర్యనారాయణ అమ్మవారికి విశేష పూజలు చేశారు. స్థానిక రిజర్వులైన్ అయ్యప్పస్వామి ఆలయంలో కామాక్షి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా అమ్మవారికి విశేష పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో నిర్వహించిన సామూహిక కుంకుమ పూజల్లో అధిక సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు. స్థానిక అశోక్‌నగర్ షిరిడిసాయి ఆలయంలో తొలిరోజు అమ్మవారు లలితాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ వేదుల అచ్చుతరామారావు దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక భానుగుడి భానులింగేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారు తొలిరోజు బాలాత్రిపుర సుందరి అమ్మవారిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వీటితోపాటు నగరంలో పలు అమ్మవారి ఆలయాల్లోను, పలు ప్రాంతాల్లో మండపాలు ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహాలు ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఊరూ వాడా ఆధ్యాత్మిక సందడి

కాకినాడ రూరల్: గ్రామాలలో దసరా సందడి మొదలైంది. అమ్మవార్ల ఆలయాలు ఆధ్యాత్మిక శోభ సంతరించుకున్నాయి. దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని గురువారం ఉదయం నుంచి ఆలయాలలో అమ్మవారికి ప్రత్యేక పూజలు మొదలయ్యాయి. ఈ నెల 12న విజయ దశమి వరకు ఉత్సవాలు జరగనున్నాయి. రమణయ్యపేటలోని ఐశ్వర్యాంబిక సుందరేశ్వరస్వామి ఆలయంతో పాటు రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ, ఆర్టీసీ కాలనీ, శేషాద్రినగర్ గ్రామాలలో ఆలయాలలో దసరా ప్రత్యేక పూజలు ప్రారంభించారు. కొన్ని చోట్ల అమ్మవార్ల ప్రతిమలను ఉంచి వేడుకలు నిర్వహిస్తున్నారు. ఆలయాలకు విద్యుత్ దీపాలంకరణలు, మహిళలు కుంకుమ పూజలు, భవాని భక్తులు దీక్షతో భజనలు, పూజలతో ప్రతి ఒక్కరూ పండగ వాతావరణంలోకి వెళ్లారు.


రమణయ్యపేటలోని శ్రీపీఠం వద్ద మహిళా భక్తుల సందడి


రమణయ్యపేట శేషాద్రినగర్‌లో బాల కనక దుర్గ అమ్మవారిని దర్శించుకుంటున్న మహిళలు

13న సూర్యకాంతం శత జయంత్యుత్సవం


బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు దంటు భాస్కరరావు తదితరులు

బోట్‌క్లబ్: మహానటి సూర్యకాంతం శతజయంతి సభ ఆహ్వాన పత్రికను గురువారం స్థానిక దంటు కళాక్షేత్రంలో ది యంగ్మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షుడు దంటు భాస్కరరావు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13న సాయంత్రం ఐదు గంటలకు దంటు కళాక్షేత్రంలో నిర్వహించే సభకు అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ముఖ్యఅతిథిగా హాజరవుతారన్నారు. సూర్యకాంతం జీవన సాఫల్య పురస్కారాన్ని సీనియర్ నటి డబ్బింగ్ జానకికి అందజేస్తున్నట్లు చెప్పారు. అనంతరం కళారత్న మీగడ రామలింగస్వామి సంగీత నవావధానం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి సూర్యకాంతం కుమారుడు అనంత పద్మనాభమూర్తి హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యనిర్వాహక సభ్యులు పీవీ రావు, సీతారామ్, ముంజులూరి విశ్వేశ్వరరావు, కట్టా కృష్ణారావు, పట్నాల రాము, మార్ని జానకిరామ చౌదరి, ఓవీఎన్ ప్రసాద్, ఎంవీ రమణ పాల్గొన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులలో జైలు, జరిమానా

కాకినాడ లీగల్: మద్యం తాగి బైక్ నడిపిన కేసుల్లో ముగ్గురికి రెండు రోజుల చొప్పున జైలు, 11 మందికి జరిమానా విధిస్తూ కాకినాడ మూడో స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ వి.నరసింహారావు తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే కాకినాడ ట్రాఫిక్–1, 2 పోలీసు స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. గురువారం వారిని కోర్టులో హాజరుపర్చగా ముగ్గురికి ఒక్కొక్కరికి రెండు రోజుల జైలు, 11 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు.

కవితా విశ్లేషణలో విద్యార్థుల ప్రతిభ

బాలాజీచెరువు: అభ్యుదయ రచయితల సంఘం నిర్వహించిన కవిత విశ్లేషణ పోటీల్లో తమ విద్యార్థులు ప్రతిభ చూపారని ఆదిత్య మహిళ కళాశాల ప్రిన్సిపాల్ కె.కరుణ గురువారం తెలిపారు. సీహెచ్ సమీర ద్వితీయ స్థానం, బి.జ్యోత్స్న సాయిలక్ష్మి చతుర్థ ప్రత్యేక బహుమతి సాధించారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను కళాశాల అకడమిక్ డైరెక్టర్ బీఈవీఎల్ నాయుడు, వైస్ ప్రిన్సిపాల్ నాగ శ్రీకాంత్, ఎన్ఎస్ఎస్ పీవో పి.సురేఖ పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు సత్కారాలు


పారిశుధ్య సిబ్బందిని సత్కరిస్తున్న ఆర్టీసీ అధికారులు

కాకినాడ సిటీ: స్వచ్ఛత హి సేవా పక్షోత్సవాల్లో భాగంగా కాకినాడ బస్‌స్టాండ్‌లో పారిశుధ్య సిబ్బందిని ఆర్టీసీ అధికారులు గురువారం సత్కరించారు. గత నెల 17 నుంచి ఈ నెల 1వ తేదీ వరకు జరిగిన స్వచ్ఛతే సేవా పక్షోత్సవాలు ముగింపు సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పనులు చేసిన సిబ్బందిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాకినాడ డిపో మేనేజర్ ఎంవీ మనోహర్, అసిస్టెంట్ మేనేజర్ టి.బాలకృష్ణ, స్టేషన్ మేనేజర్ వి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. బస్టాండ్‌లోని పారిశుధ్య సిబ్బందిని సత్కరించి వారికి నగదు బహుమతులు అందజేశారు.

కాకినాడ టౌన్ రైల్వే స్టేషన్ నుంచి బయలుదేరే రైళ్లు

ట్రైన్ నం.	స్టేషన్	గమ్య స్థానం	వెళ్లే సమయం	వచ్చే సమయం
17258	కాకినాడ పోర్టు	విజయవాడ (డైలీ మెము)	04.20	23.08
17267	కాకినాడ పోర్టు	విశాఖపట్నం (డైలీ మెము)	04.45	21.28
12755	కాకినాడ పోర్టు	భావనగర్ (భావనగర్)గురు	05.50	16.48
17206	కాకినాడ పోర్టు	సాయినగర్ (షిర్డీ) సోమ, బుధ, శని	06.10	18.55
17221	కాకినాడ పోర్టు	లోకమాన్య తిలక్ (ఎల్‌టీటీ) బుధ, శని	09.10	13.43
17655	కాకినాడ పోర్టు	పుదుచ్చేరి (సర్కార్) ఆది, బుధ, గురు	14.40	09.10
17644	కాకినాడ టౌన్	చెంగల్‌పట్టు (సర్కార్) సోమ, మంగళ, శుక్ర, శని	14.40	09.10
17250	కాకినాడ టౌన్	తిరుపతి డైలీ	15.15	11.45
17210	కాకినాడ టౌన్	బెంగళూరు (శేషాద్రి) డైలీ	17.25	06.45
12737	కాకినాడ పోర్టు	లింగంపల్లి (గౌతమి) డైలీ	19.20	06.58
07445	కాకినాడ టౌన్	లింగంపల్లి (స్పెషల్)సోమ బుధ, శుక్ర	20.10	07.10

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

కాకినాడ సిటీ: స్థానిక డి1 సెక్షన్ పరిధిలోని 33/11 కేవీ పవర్ హౌస్ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్ శాఖ ఈఈ ఎస్ ఉదయ్‌భాస్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 7.30 గంటల నుంచి 9.30 వరకు కొమ్మిరెడ్డి వారి వీధి, పీఆర్ కాలేజీ, అవసరాల వారి వీధి, పిండిప్రోలు వీధి, నూకాలమ్మ ఉడి ఏరియా, గోపాలకృష్ణ వీధి, దంటు వారి వీధి, మునసబుగారి వీధి, హోండా షోరూమ్ సెంటర్, నారావుపేట, సుబ్బయ్య హోటల్ ఏరియా, 3 లైట్ జంక్షన్, వెటర్నరీ హాస్పిటల్ రోడ్, శేషసాయి వీధి, సాంబమూర్తినగర్ వీధి, జీఆర్‌టీ గ్రాండ్ వీధి తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఈఈ తెలిపారు. వినియోగదారులు ఈ అసౌకర్యాన్ని గమనించి సహకరించాలని ఆయన కోరారు.

తూరంగి ఫీడర్‌లో మరమ్మతుల వల్ల శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు విద్యుత్‌శాఖ కాకినాడ డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎస్.ఉదయ్‌భాస్కర్ గురువారం రాత్రి తెలిపారు. తూరంగి ఫీడర్‌లోని రవీంద్రనగర్, గాంధీ ఎన్‌క్లేవ్, గాయత్రి స్కూల్ రోడ్డు, ఖాదీబండార్ రోడ్డు, కోటిపల్లిరోడ్డు, భాస్కర్ గార్డెన్స్, సూర్యనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ వివరించారు.

అలాగే తూరంగి ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలో 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు 11 కేవీ లైన్ మరమ్మతుల నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఈఈ తెలిపారు. ఈ ఫీడర్ పరిధిలోని అనిశెట్టి బుల్లబ్బాయిరెడ్డి కాలనీ, ఈశ్వర్‌కాలనీ, గోపీకృష్ణాకాలనీ, సత్యదుర్గానగర్, శివకృష్ణకాలనీ, హోప్ ఐలాండ్ కాలనీ, యానాం రోడ్డు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ వివరించారు.